సేవ చేసుకుంటా.. అవకాశమివ్వండి

• వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్



మేడిపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి: రాముడు పద్నాలుగేళ్ల వనవాసం ఎదుర్కొంటే, తాను పదహారేళ్లుగా ఓడిపోతున్నా, మీ మధ్యే ఉంటూ, మీకు సేవ చేసుకుంటున్నానని, మీ కన్నబిడ్డగా అనుకొని, ఇప్పుడన్నా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మేడిపల్లి మండలంలో నిర్వహించిన రోడ్‌షోలో అన్నారు. ఆదివారం మండలంలోని గుండ్లపల్లి, పోరుమల్ల, కట్లకుంట, మేడిపల్లి, కల్వకోట, వల్లంపల్లి, మాచపూర్, దమ్మన్నపేట, మన్నెగూడెం, ఈదులింగంపేట, గోవిందారం, పసునూర్, మోత్కురావుపేట, రాజలింగంపేట, రత్నాలపల్లి గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. నాలుగుసార్లు ఓడిపోయిన బాధను దిగమింగుకొని, ఎప్పుడు ప్రజల మధ్యే ఉన్నానని, ఈ ఎన్నిక డబ్బు ఉన్నోళ్లకు, పేదలకు జరుగుతున్న ఎన్నిక అని అన్నారు. బహుజనుల బిడ్డగా ఒకవైపు నేనుంటే, దొరలు మరోవైపు ఉన్నారన్నారు. ఇన్ని రోజులు దొరలకు అవకాశం ఇచ్చారని, ఈ ఒక్కసారి బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వండని కోరారు.



ప్రచారం చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల ప్రచారం

వేములవాడ: కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిట్టల మనోహర్, లీగల్ టీం సభ్యులు నరాల శ్రీనివాస్ భాను ప్రసాద్, శ్రీకాంత్ జెట్టి శేఖర్ ఆదివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఇంటింటా ప్రచారం చేశారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కాశవత్రి వంశీ, కార్యదర్శి రాధారపు సాయితేజ పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా

• వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



వేములవాడ సుభాష్‌నగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు, హాజరైన ప్రజలు

వేములవాడ: ఈ ప్రాంతబిడ్డగా ఈ ప్రాంతానికి సేవలందించాలని ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలంతా ఆశీర్వదించి తనను అసెంబ్లీకి పంపిస్తే ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో మాజీ కౌన్సిలర్ రాపెల్లి లావణ్య శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని, ప్రజలు ఆశీర్వదిస్తే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకారంతో వేములవాడను ఎవరూ దత్తత తీసుకోకుండా స్వయంగా అభివృద్ధి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యావంతుడ్ని ఎన్నుకోండి

వేములవాడ బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు విద్యావంతుడనీ, ఆయన్ని గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధిలో భాగం పంచుకోవాలని వికాస్‌రావు సతీమణి డాక్టర్ దీప అన్నారు.



ప్రచారం చేస్తున్న వికాస్‌రావు సతీమణి దీప

కథలాపూర్: మండలంలోని పోసానిపేట గ్రామంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

చైతన్యం 'ఓటె'త్తాలి

• నూరు శాతం పోలింగ్ జరగాలి
• ఓటు.. బంగారు భవిష్యత్‌కు రూటు
• సిరిసిల్లలో ఓటు హక్కుపై ప్రజాభిప్రాయం

సిరిసిల్లటౌన్: దేశపౌరులు అందరూ ఓటు వేయాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. నిజమైన నాయకులు చట్టసభల్లోకి వెళ్లి ప్రజా సమస్యలు పరిష్కృతమైతాయి. ఇందుకు ఓటు హక్కున్న ప్రతి పౌరుడు తమ ప్రాథమిక హక్కును వినియోగించుకోవాలని ఉద్యోగులు, వ్యాపారులు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ శాంతిప్రకాష్ శుక్లా అన్నారు. ఓటు ఆవశ్యకతపై పలు స్వచ్ఛంద సంస్థలు సైతం తమ విధిగా ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం రగిలిస్తున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నూరుశాతం ఓటింగ్‌కై 'సాక్షి' ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రజలను కదిలించగా వెలిబుచ్చిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ఓటు తల్లిలాంటిది..



ఓటు కన్నతల్లి వంటిది.. నమ్ముకోవాలి.. డబ్బుకు, ప్రలోభాలకు అమ్ముకోవద్దు ఓటరన్న. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పవిత్రమైనది. దేశాభివృద్ధిలో ప్రజల చేతిలో ఉండే వజ్రాయుధం. ఎటువంటి నాయకత్వాన్ని ఎన్నుకోవాలో ఐదేళ్లకోసారి తేల్చే అవకాశం కల్గినది. ఓటర్లు నూరుశాతం ఓటింగ్‌లో పాల్గొనాలి.

– జూకంటి జగన్నాథం, టీఆర్‌వీ జాతీయ అధ్యక్షుడు

ఓటు వృథా కాదు.. వజ్రాయుధం



ఓటు అనేది.. ఏవిధంగా వృథా కాదు.. దేశ బంగారు భవిష్యత్తుకు ఉపయోగపడే వజ్రాయుధం వంటిది. ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలి. పౌరులు అందరూ నిజాయితీతో ఓటు వేయాలి. ప్రజాసేవకు అంకితమైన నాయకులను గుర్తించి ఓటు వేయాలి. అప్పుడు మన రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుంటుంది.

– శారద, జెడ్పీజీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, సిరిసిల్ల

సరైన నాయకుడికి ఓటేయాలి



రాష్ట్రం సమగ్రాభివృద్ధికి రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సరైనవి. మన ప్రాంతాన్ని అభివృద్ధి పరిచే నాయకులను ఎన్నుకోవాలి. లేదంటే ఐదేళ్లు బాధపడేది ఓటరే. ఓటు హక్కు వినియోగంపై ప్రజలు తెలుసుకోవాలి. ప్రతి ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువ అవుతుంది. నూరు శాతం పౌరులు ఓటు వేస్తే, అందరు మెచ్చే సర్కారు ఏర్పాటు తథ్యం.

– చింతోజు భాస్కర్, స్వచ్ఛంద సంస్థల జిల్లా అధ్యక్షుడు

నిజాయితీతో ఓటు వేయాలి



ఓటరు నిజాయితీగా ఓటు వేసినప్పుడే ప్రజలు ఆకాంక్షించే సరైన నాయకత్వం వస్తుంది. నాయకుల పనితీరును తెలుసుకోవాలి. ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం భారత పౌరుల విధి. ప్రజా శ్రేయస్సుకు పనిచేసే వారికి ఓటేస్తే సమాజం బాగుపడుతుంది. దేశాభివృద్ధికి యువత ఓటు అస్త్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కందేపి రాణీప్రసాద్, బాల సాహితీవేత్త

ఓటింగ్ వంద శాతం జరగాలి



ప్రతి ఎన్నికల మాదిరి కాకుండా ఇప్పుడైనా ఓటర్లు అందరూ నూరు శాతం ఓట్లేయాలి. మన ప్రాంతం నుంచి వేలాది మంది ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలసలు వెళ్లారు. మంచి నాయకుడిని ఓట్లేసి గెలిపిస్తే..మన ప్రాంతం అభివృద్ధి సాధించి స్థానికంగా ఉద్యోగాలు చేయొచ్చు. అన్ని సామాజిక సంస్థలు ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం పర్చాలి. నా విధిగా ప్రచారం చేస్తున్న

– వేముల మార్కండేయులు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్

ఎన్నికల తేదీ సెలవుగా భావించొద్దు



ఓటు వేయడం బాధ్యతగా మరిచి కొందరు సెలవు దినంగా భావిస్తుంటారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిది. ప్రజాశ్రేయస్సు, ప్రాంతీయ అభివృద్ధి కాంక్షించే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. పోటీలో ఉన్న సరైన నాయకుడిని గుర్తించి ఓటు వేస్తే, అందరు ఆకాంక్షించే ప్రభుత్వం రావడం తథ్యం. ఓటు వినియోగం దేశ పౌరుల ప్రాథమిక కర్తవ్యం.

– డాక్టర్ శోభారాణి, ఐఎంఏ ఉమెన్స్‌వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

అవకాశం ఇవ్వండి.. అందుబాటులో ఉంటా



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

• సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల/తంగళ్లపల్లి: అందుబాటులో ఉండి సేవ చేస్తానని, ఒక్క అవకాశం ఇవ్వాలని సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్, సుభాష్‌నగర్ కార్మికవాడల్లో, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, చిన్నలింగాపూర్, నర్సింహులపల్లె, రామన్నపల్లె, అంకిరెడ్డిపల్లె ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇస్తే, ఈ ప్రాంత సహజ వనరులను దోపిడీ చేశారని ఆరోపించారు. దొరల పాలనలో తెలంగాణ దోపిడికి గురైందని ఆరోపించారు. ఎవరికీ అందుబాటులో ఉండకుండా, మన కష్టసుఖాలు పట్టించుకోకుండా కొందరివాడిగా కేటీఆర్ ఉన్నారన్నారు. ఈ ప్రాంత బిడ్డగా, మీ వాడిగా మీతో ఉంటానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. సిరిసిల్ల కార్మికులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. వస్త్రపరిశ్రమ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ కుమార్ (టోని), నాయకులు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, గడ్డం నర్సయ్య, లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, వెంకటరమణ, ఎల్లప్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఎల్లారెడ్డిపేట: మండలం కిష్టునాయక్‌తండాలో పలువురు గిరిజనులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి



రామన్నపల్లిలో మాట్లాడుతున్న రాణిరుద్రమ

• సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ

ముస్తాబాద్/తంగళ్లపల్లి: డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందని బీజేపీ సిరిసిల్ల అభ్యర్థి రుద్రమదేవి అన్నారు. ఆదివారం ముస్తాబాద్ పట్టణంతో పాటు తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లె, జిల్లెల్ల, నేరెళ్ల, పద్మనగర్, తంగళ్లపలిలో రోడ్‌షోలో మాట్లాడారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రధాని మోదీని ఒప్పించి సిరిసిల్లకు పవర్ లూమ్ క్లస్టర్ తీసుకువస్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, డబుల్ బెడ్రూంకు కేంద్రం నిధులిస్తే పక్కదారి పట్టించారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ అండ చూసుకుని ఆయన అనుచరులు ఇసుక దందాలు, భూదందాలు చేస్తున్నారని, వాడకొక, గ్రామానికి ఒక దొర తయారై అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. ముస్తాబాద్‌లో 30 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించడంలో మంత్రి కేటీఆర్ విఫలమయ్యారని ఆరోపించారు. గల్ఫ్ కార్మికులను ఏనాడు పట్టించుకొని కేటీఆర్, ఇప్పుడు వారి కుటుంబాలపై మొసలి కన్నీరు కారుస్తున్నాడన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కర్ణాటక ఎమ్మెల్యే సోమన్న, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజు యాదవ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సిరిసిల్ల వంశీ, బీజేపీ సీనియర్ నాయకుడు గజభీంకార్ సంతోష్, మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పద్మ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

• చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం



రామడుగు: వెలిచాలలో ఎన్నికల ప్రచారంలో మేడిపల్లి సత్యం, నాయకులు

చొప్పదండి/గంగాధర/రామడుగు/బోయినపల్లి: ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం కోరారు. చొప్పదండి మండలంలోని కాట్నపల్లి గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. గుమ్లాపూర్ బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు వెల్మ రఘుపతిరెడ్డి, వార్డు సభ్యులు వెల్మ మాలతి, మంగ, కడారి రత్నకుమారి కాంగ్రెస్‌లో చేరగా సత్యం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరో 20 మంది కుల సంఘాల సభ్యులు పార్టీలో చేరారు.

ఒక్కసారి అవకాశమివ్వండి

ఒక్కసారి అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మేడిపల్లి సత్యం ఓటర్లను అభ్యర్థించారు. గంగాధర మండలం వివిధ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. నారాయణపూర్ రిజర్వాయర్ కుడి,ఎడమ కాలువల పనులు పూర్తి చేస్తానని, ఎల్లమ్మ చెరువు కట్ట మరమ్మతు చేయిస్తానని, ముంపు గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం ఇప్పిస్తానన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పుట్టిన ఊరు నారాయణపూర్, పెరిగిన ఊరు గంగాధర, ప్రస్తుతం ఉంటున్న బూర్గుపల్లి గ్రామానికి చేసిందేమీ లేదన్నారు. ఎల్లమ్మ చెరువు తెగి రెండేళ్లు కావస్తున్నా మరమ్మతు లేదన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. పదేళ్లుగా మీ వెంటే ఉంటున్న అవకాశం ఇవ్వాలని కోరారు.

ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని మేడిపల్లి సత్యం తెలిపారు. రామడుగు మండలం వెలిచాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెంట పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్యప్రసన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పుల అంజనీప్రసాద్, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, కొండగట్టు దేవస్థానం బోర్డు సభ్యులు బండపెల్లి యాదగిరి, నాయకులు తిరుపతి, కాడె శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ

బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్‌ఎస్ నాయకుడు సంది సంపత్ కుమార్ మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సంపత్‌తో పాటు ఆయన సతీమణి గ్రామ సర్పంచ్ సంది సౌందర్య, ఉపసర్పంచు నారాయణ వార్డు సభ్యుడు లక్ష్మన్, రెడ్డి, మున్నూరు కాపు సంఘాల అధ్యక్షులు పోరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సంది శేఖర్, తిప్పరవేని కనుకయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొలుమాల శంకర్, తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన సంది సంపత్, తదితరులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

• కాంగ్రెస్ మానకొండూర్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ



కవ్వంపల్లి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలు

మానకొండూర్/గన్నేరువరం: చేతులెత్తి మొక్కుతున్నా బీఆర్‌ఎస్‌ను గద్దె దించడానికి చేతిగుర్తుకు ఓటెయ్యండి అని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. చెంజర్ల, లక్ష్మీపూర్, వేగురుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్లు అవకాశమిస్తే ఏం అభివృద్ధి చేశావని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై మండిపడ్డారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లే ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసే పనులు వివరించారు. నా భర్తను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గంలో వందపడకల ఆసుపత్రి కట్టిస్తామని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని కవ్వంపల్లి సతీమణి అనురాధ అన్నారు. ఎంపీపీ సులోచన శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు అర్చనభగవాన్‌రెడ్డి, మురళి, మండల అధ్యక్షుడు రవీంద్రాచారి, ఉపసర్పంచ్‌కుమార్, తదితరులున్నారు.

పార్టీలో ఉంటే దేవృక్షం.. లేకుంటే దయ్యాలమా?

బీఆర్‌ఎస్‌లో ఉంటే దేవృక్షం లేకుంటే దయ్యాలమా అంటూ ఎంపీపీ ముద్దసాని సులోచన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేగురుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ఓ దొంగల ముఠా వేగురుపల్లి వచ్చి తనపై తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. డబ్బులు తీసుకుని కాంగ్రెస్ పార్టీలో చేరానని, ఎంపీపీ కులం గురించి ఆరోపణలు చేశారని, పార్టీలో ఉన్నప్పుడు గుర్తుకురాలేదా అంటూ ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. రాజకీయంగా దాడి చేయాలి, వ్యక్తిగతంగా మాట్లాడితే ఉరికిస్తామన్నారు. మానకొండూర్‌లో దళితబంధు ప్రవేశపెడతానని సీఎం కేసీఆర్ చెప్పడం వెనుక ఆంతర్యం మానకొండూర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఓటమిని అంగీకరించినట్టేనని అన్నారు.

కమీషన్ల రసమయికి గుణపాఠం చెప్పాలి

కమీషన్ల రసమయికి ప్రజలు గుణపాఠం చెప్పాలని కవ్వంపల్లి అన్నారు. గన్నేరువరం మండలం మాదాపూర్, కాసింపేట గ్రామాల్లో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ పదవులు అమ్ముకునే రసమయికి అభివృద్ధి పట్టదని విమర్శించారు. రసమయి హైట్రిక్ విజయం సాగిస్తానని విర్రవీగుతున్నాడని,ప్రజలు దిమ్మతిరిగే షాక్ ఇవ్వబోతున్నారని అన్నారు. వివిధ గ్రామాలకు చెందిన సుమారు 250 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీ మల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ కోటి, మండల అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సర్పంచులు నరసింహారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి, ఎస్సీ బీసీ సెల్ మండల అధ్యక్షులు అనిల్, మల్లేశం, నాయకులు మల్లేశం, దేవయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం



విన్యాసాలు చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థినులు

తంగళ్లపల్లి: తెలంగాణ మహిళా గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఆదివారం 75వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రజని, ఎన్‌సీసీ కేర్ టేకర్లు రెహానా, ఇఫాత్, పీఐ రమేశ్, 75 మంది ఎన్‌సీసీ విద్యార్థినులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం



బాలికల జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న లెక్చరర్లు

సిరిసిల్లటౌన్: భారత రాజ్యాంగ ముసాయిదా పేటికను ఆమోదించిన రోజు పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రం బాలికల జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జీ.వనజకుమారి మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేద్కర్ ఆదర్శాలను ప్రపంచ దేశాలు అనుసరించడం దేశ ప్రజలకు గర్వకారణంగా పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ ఫొటోకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. భారత రాజ్యాంగ ప్రవేశికను చదివి ప్రమాణం చేశారు. లెక్చరర్లు బాలప్రసాద్, సీతారామాంజనేయులు, దీప్తి, సునీత, అనిత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే నేతన్నల సంక్షేమం

• బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు
• సిరిసిల్ల కార్మికవాడల్లో ప్రచారం
• ఆసాములతో సమావేశం

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే వస్త్రపరిశ్రమ అభివృద్ధి, నేతన్నల సంక్షేమ సాధ్యమవుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కార్మిక వాడల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని సాగించారు. ఇందిరానగర్‌లో స్థానిక కౌన్సిలర్ సీమాబేగం అక్రమ్‌తో కలిసి ప్రచారం చేశారు. గణేశ్‌నగర్‌లో ఆసాములతో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్లు రావడంతోనే నేతన్నల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. భవిష్యత్‌లోనూ మరింత అభివృద్ధి, సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని నర్సింగరావు వివరించారు. నేతన్నలు కారు గుర్తుకు ఓటు వేసి కేటీఆర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, వస్త్రవ్యాపారి గోవింద్ రవి, బలగం సినిమా డైరెక్టర్ యెల్దండి వేణు, అన్నల్‌దాస్ వేణు, వస్త్రోత్పత్తిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీటి నర్సింగరావు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో సర్పంచ్ కాశోల్ల పద్మ ఆధ్వర్యంలో పలు పార్టీల నుంచి యువకులు బీఆర్‌ఎస్‌లో ఆదివారం చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ శరత్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, దుర్గాప్రసాద్, రంజిత్, దేవదాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

తంగళ్లపల్లి: మండలంలోని కేసీఆర్‌నగర్ సముదాయంలో ఆదివారం లయన్స్ క్లబ్ సిరిసిల్ల ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ వైద్యులు శోభారాణి, జైల్‌సింగ్, అనంతుల మోహనకృష్ణ, రవీందర్, పబ్బ యాదగిరి, భాను, క్లబ్ అధ్యక్షుడు నంగునూరి శ్రీకాంత్, పడీజీ అనంతుల శివప్రసాద్, గుగ్గిళ్ల జగన్ గౌడ్, సుమన్, పవన్, గుండ రవి, నాగుల సంతోష్ గౌడ్, సంజీవరావు, శివప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట: మాజీ సర్పంచుల న్యాయమైన డిమాండ్లను ఏ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. ఆదివారం మాట్లాడుతూ కాంగ్రెస్ మాత్రం మేనిఫెస్టోలో చేర్చిందన్నారు. అందుకే కాంగ్రెస్‌కే మద్దతు ప్రకటిస్తున్నామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899